
○○

"ప్రజా నాయకులు రెండు రకాలు. ఒకరు–రేపటి ఎన్నికల గురించి ఆలోచిస్తారు–రెండవ వారు– రేపటి తరం గురించి ఆలోచిస్తారు"

○○




'అండమాన్ జైలుకి పంపడమంటే నరకం లోకి తోసెయ్యడమే'–అన్నది అక్షర సత్యం. స్వాతంత్ర్య పిపాసుల పీకనొక్కి, వారు మృత్యు కౌగిట క్షణాల్ని లెక్క పెట్టుకునేలా చేయడానికి నిర్మించిందే ఆ జైలు. వీర్ సావర్కర్ వంటి దేశభక్తులు; పత్రికా ప్రపంచంలో విశిష్ట స్థాన మున్న 'స్వరాజ్య' సంపాదకులు హోతీలాల్, బాబూరావు హరి వంటి విద్యాధికులకు కూడా ఆ జైలు శిక్ష విధించడం జరిగింది. దేశ భక్తి ప్రబోధిస్తూ ఓ గీతం రాసి తన పత్రికలో ప్రచురించినందుకు బాబూరామ్ హరికి 21 ఏళ్ళు, ఓ ఇంగ్లీషువాడు ఓ భారతీయ స్త్రీని చెరచిన విషయాన్ని రామ్‌కపూర్ తన పత్రికలో ఉటంకిస్తూ, "భారతీయులు స్త్రీలను తోబుట్టువుల్లా గౌరవిస్తారు. కాని ఈ తెల్లదొర మానమర్యాదలు లేకుండా పశువులా ప్రవర్తించాడు" అని వ్యాఖ్యానించినందుకు ఆయనకు 12 ఏళ్ళు జైలుశిక్ష విధించారు.

అలిపూర్ కుట్ర కేసు–నాసిక్ కుట్రకేసు–గ్వాలియర్ కుట్ర కేసు వలెనే 1937లో కాకినాడ కుట్ర కేసు కూడా చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయింది. కాకినాడ కుట్ర కేసులో భయం కరాచారితోపాటు పాల్గొన్న ఫణి భూషణరావు పోలీసులకి చిక్కలేదు; తన అనుచరులతో నాసిక్ పారిపోయాడు. నాసిక్‌లో వైశ్రాయ్ లార్డ్ మింటో కారుమీద బాంబులు విసిరిన కేసులో వున్నాడు. అప్పుడు పోలీసులకి చిక్కలేదుగాని మేజిస్ట్రేట్‌ని కాల్చి చంపినప్పుడు మాత్రం దొరికిపోయాడు. ఫణి భూషణరావుతో కలుపుకొని మొత్తం 31 మందిని విచారించడం జరిగింది. వీరిలో 17 మందికి మరణశిక్ష, మిగిలిన 13 మందికి యావజ్జీవ కారాగార శిక్ష–అండమాన్ బ్లెయిర్ పోర్టులోని సెల్యులార్ జైలుకి తరలించవలసిందిగా కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఈ 31 మందిలో ఫణిభూషణరావు లేడు. ఫణిభూషణరావుని నిర్దోషిగా నమ్మింది న్యాయ స్థానం. తన సహచరులంతా ఉరికంబాలు, జైలు గోడలకి పరిమితం కావడంతో స్వరాష్ట్రం తిరిగి వచ్చాడు. ఉద్యమ నేపథ్యాన్ని మాత్రం మర్చిపోలేదు.

* * *

ఆ ఫణిభూషణరావు ఇప్పుడు మన రాష్ట్రానికి హోం మంత్రి. స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలు పోగొట్టుకున్న వారి స్మృతికి గుర్తుగా ఆడిటోరియం నిర్మించడం జరిగింది. ఆ ఆడిటోరియం ప్రారంభోత్సవానికి సతీసమేతంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫణిభూషణరావు కార్యక్రమం ముగిసిన తర్వాత గెస్టు హౌస్‌లో విడిది చేశారు. ఆ ఆడిటోరియం లోని ఫోటోలు చూసినప్పుడు స్వాతంత్ర్యోద్యమం మరోమారు కళ్ళముందు మెదిలింది. గుండె కింద తడి తగిలింది.

అప్పుడు సమయం రాత్రి రెండు గంటలయి వుంటుంది.

"గుడ్‌మార్నింగ్ సార్, నేను డిజిపి సుకుమార్‌ని మాట్లాడుతున్నాను."

"సంగతేమిటి?" అడిగాడు హోమ్ మినిస్టర్.

"క్షమించాలి సార్, మిమ్మల్నింత రాత్రివేళ డిస్టర్బ్ చేసాను."

"ఫరవాలేదు లెండి, ఎంతో అవసరముంటేగానీ ఈ టైములో ఫోన్ చేయరుగా!"

"నగర శివార్లలో ఒక ఎన్‌కౌంటర్ జరిగింది. మీరొకసారి చూస్తే బావుంటుంది."

"నేను చూడవలసిందేముంది, పత్రికల వాళ్ళకిచ్చే స్టేట్‌మెంట్ మాత్రం జాగ్రత్తగా తయారు చేయించండి. ఈ మధ్య మన డిపార్టుమెంటుని మరీ ఏకేస్తున్నారు."

"ఓ.కే. సర్...కానీ, మీరు, మీ శ్రీమతిగారు



ఓసారి ఇక్కడికొస్తే బావుంటుందనుకుంటున్నానండి."

"ఏమిటంత పట్టింపుగా అడుగుతున్నారు? శవాల్ని మేము చూడ్డమేమిటి? అయినా శవాల్ని అర్జంటుగా హాస్పిటల్‌కి ఎందుకు తీసుకొచ్చారు?" కాస్త చిరాకుపడ్డాడు భూషణరావు.

"అ...ఒక శవం చేతి మీదున్న పచ్చబొట్టు చూసిన తర్వాత..." అంటూ నసిగాడు.

హోమ్ మినిష్టరు భూషణరావు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

"ఆ...ఆ...అలాగే...వెంటనే బయల్దేరతాను" అన్నాడు. మంత్రిగారి శ్రీమతి భర్త ముఖ కవళికలను బట్టి విషయాన్ని కొంతవరకు గ్రహించింది. ఫణిభూషణరావుకి విషయం చెప్పక తప్పలేదు. తెలుసుకున్న ఆమె ముఖం రంగులు మారింది. ముందు పైలట్ జీపు బయల్దేరగా, భార్యా సమేతుడై హోమ్ మినిష్టర్‌గారు సెక్యూరిటీతో సహా కారులో బయల్దేరారు. భూషణరావుకి గత స్మృతులు మనసులో మెదలసాగాయి.

భూషణరావుకి అప్పుడు పందొమ్మిది సంవత్సరాలు వుంటాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఓ కుగ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టాడు. రివల్యూషనరీ సోషలిస్టు పార్టీవలన ప్రభావితుడై రివల్యూషనరీగా మారాడు. నాసిక్ కుట్ర కేసులో నిర్దోషిగా విడుదలయి స్వగ్రామం చేరాడు. భూషణరావుకి నారాయణ, రామమూర్తి అనే ఇద్దరు ప్రాణ స్నేహితులున్నారు. అది 1946

వ సంవత్సరం జులై నెల.

ఫణిభూషణరావు ఇంటికి, స్వగ్రామానికి పరిమితం కాలేకపోయాడు. ముగ్గురు మిత్రులు ఓ రోజు ఇంటి నుండి పారిపోయారు. విజయవాడలో నాటు బాంబులు తయారుచేస్తున్న సూర్యనారాయణని కలుసుకున్నారు. ఎలాగయితేనేం అత్యంత శక్తివంతమైన బాంబులను సమకూర్చుకున్నారు. బ్రిటిషు పాలకుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించడం కోసం తమ పథకాన్ని అమలు పరచడానికి ఓ రోజు ఎన్నుకున్నారు. భూషణరావు మద్రాసు, నారాయణ బొంబాయి, రామమూర్తి కలకత్తా బయల్దేరారు.

అనుకున్న రోజున నూనూగు మీసాలతో అమాయకంగా కనిపిస్తున్న పల్లెటూరి కుర్రాడు భూషణరావుకి మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించడం సులభంగానే సాధ్యపడింది. అతను ఓ బ్రిటిషు జడ్జిగారి మీద విసిరిన బాంబు, ఆ జడ్జిగారి ప్రాణాన్నే కాక, ఓ ఇద్దరు పోలీసుల ప్రాణాల్ని కూడా హరించింది. అనుకున్న పనయితే జరిగింది కానీ భూషణరావు వెంటనే పట్టుబడ్డాడు. అతన్నీ అక్కడికక్కడే చావబాది అరెస్టు చేసారు.

నారాయణ బొంబాయి హైకోర్టులో బాంబు విసిరి ఓ జడ్జిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ని చంపి పట్టుబడ్డాడు. రామమూర్తి మాత్రం తన ప్రయత్నంలో పూర్తిగా విఫలమయ్యాడు. కలకత్తా హైకోర్టులో అతను విసిరిన బాంబు పేలలేదు సరికదా, అక్కడికక్కడే పోలీసులచే కాల్చి చంపబడ్డాడు.

బొంబాయి న్యాయస్థానంలో నారాయణ కేసు విచారణ ఆరు నెలల్లో పూర్తయింది. 1947 ఏప్రిల్‌లో అతను ఉరితీయబడ్డాడు. మద్రాసు న్యాయస్థానంలో భూషణరావు కేసు మాత్రం కుంటి నడక నడిచింది. తీర్పు వెలువడే లోగానే భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించబడింది. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధులపై మోపబడిన కేసులన్నీ ఉపసంహరించుకుంది.

విడుదలయిన తర్వాత భూషణరావు స్వగ్రామానికొచ్చి అనాధగా వున్న నారాయణ చెల్లెలు రత్నమ్మను వివాహమాడాడు. కొన్నాళ్ళకి రాజకీయాల్లో ప్రవేశించి అంచెలంచెలుగా అభివృద్ధి సాధించి ప్రస్తుత పదవికి చేరుకున్నాడు. భూషణరావుకి ఎప్పుడూ ఓ విషయం ఆశ్చర్యం కలిగిస్తుంటుంది. ఒకే లక్ష్యం తమ ముగ్గురు మిత్రులకూ విభిన్న ఫలితాలను ఎలా ఇచ్చిందోనని! రామమూర్తి చేసిన పనికి వెంటనే శిక్షపడిపోయింది. నారాయణ అప్పటి న్యాయ వ్యవస్థ చేతిలో చట్టం పిడికిలిలో కొన్ని నెలల్లోనే నలిగిపోయి రాలిపోయాడు. అలాంటిపనే చేసిన తనకి మాత్రం తీర్పు అమలు జరపటం లేటయ్యేసరికి మారిన పరిస్థితుల దృష్ట్యా సన్మానాలు, సత్కారాలు లభించడం, ఉన్నత పదవుల నధిష్టించడం జరిగింది. దీన్ని విధి అనాలో, మరి ఇంకేమనాలో, వాళ్ళు చేసిన పాపమేమిటో తన పుణ్య మేమిటో తనకెప్పుడూ అర్థం కాలేదు.

బయట కారు హారన్ల చప్పుడుకి భూషణరావు తన ఆలోచనల నుండి బయటకు వచ్చాడు. అప్పుడే తెల్లవారుతోంది. ట్రాఫిక్ పెరుగుతూంది. రత్నమ్మ కళ్ళు మూసుకుని వుంది. అశ్రుధారలతో బుగ్గలు తడిసి వున్నాయి. అది చూసి భూషణరావు కళ్ళు కూడా చెమర్చాయి. ఆయన మళ్ళీ గత స్మృతుల్లోకి జారిపోయాడు.

భరత్ కుమార్ భూషణరావుకి ఒక్కగా నొక్క కొడుకు. ప్రసవానంతర వైద్య సమస్యల కారణంగా రత్నమ్మ మళ్ళీ గర్భవతయ్యే అవకాశం లేదని డాక్టర్లు తేల్చి చెప్పారు. భరత్‌కుమార్ ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో మార్క్సిస్టు, లెనినిస్టు సాహిత్యానికి ఆకర్షింపబడ్డాడు. అయిదేళ్ళ క్రిందట చదువు, ఇల్లు వదిలిపెట్టి నక్సలైట్లలో చేరిపోయాడు. అప్పటి నుంచి అతని జాడే తెలియలేదు. ఇంటి నుండి వెళ్ళిపోయేటప్పుడు కొడుకు రాసిన ఉత్తరంలోని మాటలు భూషణరావుకి ఎప్పుడూ మనసులో మెదులుతుంటాయి. "ఈనాడు కరుడుకట్టిన టెర్రరిస్టుగా అసహ్యించుకున్న వ్యక్తినే రేపు దేశభక్తుడుగా జనం శ్లాఘించవచ్చు. కాలం, మారే పరిస్థితులే ప్రజల దృక్పథానికి అద్దంపడతాయి. సమస్యలకు సమాధానం చెవుతాయి. రామన్న కాలంలో టెర్రరిస్టు అమర వీరుడే అవచ్చు. భావి భారత రాజ్యాంగ నిర్మాతయే కావచ్చు..."

ఇంతలో "సార్...వచ్చేసాం..." అన్న మాటలవల్ల ఆలోచనల నుంచి తేరుకున్న భూషణరావుకి కారు గాంధీ జనరల్ హాస్పిటలు గేటు గుండా ప్రవేశిస్తుండటం తెలిసింది. డి.జి.పి., ఇతర పోలీసు ఆఫీసర్లు ఆయన్ని సాదరంగా హాస్పిటలు సూపర్నెంటు రూములోనికి తీసుకెళ్ళారు. రత్నమ్మను ప్రక్క రూములో కూర్చోబెట్టారు.

గొంతు సవరించుకుని డి.జి.పి. జరిగిన సంగతి చెప్పాడు. "నిన్న వరంగల్లుకి 28 కి.మీ. ఉత్తరంగా మారుమూల కుగ్రామం రామన్న పాలెంలో నక్సలైట్లు దోపిడీ చేసి, ఇద్దరు భూస్వాములను నరికే




## ఆంధ్రప్రదేశ్‌లో కూడా
## రీగల్ అల్ట్రా లిక్విడ్ బ్లూ!

తమిళనాడు అంతటా ప్రతి ఇంటా వినిపిస్తూ, విశేషంగా ఆదరం సంపాదించిన రీగల్ అల్ట్రా వైట్ లిక్విడ్ బ్లూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ మార్కెట్‌లో సంచలనం సృష్టించడానికి సిద్ధంగా వుంది. రీగల్ అల్ట్రా వైట్ లిక్విడ్ బ్లూ తమిళనాడు ప్రజల హృదయాలను దోచుకుంది. వారి విశ్వాసం పొందింది.

అనుకూలంగా వుండే విధంగా ఖచ్చితమైన బ్లెండ్ మరియు పొదుపు కారణంగా రీగల్ లిక్విడ్ బ్లూ వ్యాపార రంగంలో విప్లవం సృష్టించింది. చికాకు కలిగించే బ్లూ పౌడర్ వుపయోగించవలసిన శ్రమ లిక్విడ్ బ్లూ తొలగిస్తుంది. ఇది ఎంతో చిక్కగా వుండడంవల్ల ఎక్కువ బట్టలకి కొద్ది చుక్కలు వేస్తేనే సరిపోతుంది.

రీగల్ అల్ట్రా లిక్విడ్ బ్లూ సదరన్ ఇండియా మార్కెటింగ్ ఏజెన్సీస్ ప్రై లిమిటెడ్ వారి ఉత్పాదన. కోయంబత్తూరుకి చెందిన ఈ కంపెనీ ముఖానికి రాసుకునే పసుపు పొడినీ ఉత్పత్తి చేస్తోంది. 'మంగళం' బ్రాండ్‌గల ఈ పసుపు పొడి తమిళనాడులో ఇదివరకే ప్రవేశపెట్టారు. రీగల్ అల్ట్రా వైట్ లిక్విడ్ బ్లూని మరియు మంగళం పసుపుపొడిని ప్రస్తుతం విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. విదేశీ వ్యాపార రంగంలో ఇవి చరిత్ర సృష్టిస్తున్నాయి.

ఈ ఉత్పాదనలు ఆంధ్రప్రదేశ్ మార్కెట్‌లో ప్రవేశించడంతో అత్యుత్తమ నాణ్యతగల ఉత్పాదనలు వినియోగదారులకు లభిస్తాయనడంలో ఏ మాత్రం సందేహం వుండదు.

సినట్టుగా వార్త అందింది. అది నిజానికి నక్సలైట్లు వేసిన ట్రిక్కు. ఇన్వెస్టిగేషన్ నిమిత్తం బయల్దేరిన రెండు జీవులూ వాళ్ళు పెట్టిన మందు పాతర పాలయ్యాయి. ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, అయిదు గురు కానిస్టేబుళ్ళూ అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన కానిస్టేబుళ్ళు సాగించిన ఎదురు కాల్పులకు పొదల్లో దాగివున్న నలుగురు నక్సలైట్లు కూడా బలయ్యారు. వాళ్ళ దగ్గరున్న బాంబులు పేలి వారి శరీరాలు గుర్తుపట్టడానికి వీల్లేనంతగా మాడిపోయాయి" డి.జి.పి. ఓ క్షణం ఆగి భూష ణరావు ముఖంలోకి చూసాడు. అతని ముఖం భావరహితంగా వుంది.

"శరీరాలు పూర్తిగా మాడిపోయి, తునకలయి నప్పటికీ ఒక శవం చేతిమీద వున్న పచ్చబొట్టు స్పష్టంగా తెలుస్తోంది."

"సరే చూద్దాం పదండి" అంటూ భూషణరావు లేచాడు. సుకుమార్ ఇతర ఆఫీసర్లు ఆయన తోపాటు మార్చురీవైపు కదిలారు. అక్కడి దృశ్యం చాలా బీభత్సంగా వుంది. వాటిని శవా లనేకంటే మాడిపోయిన మాంసం ముద్దలంటే బావుంటుంది. సుకుమార్ ఓ శవం చేతి మీది పచ్చబొట్టు చూపించాడు. భారతమాత బొమ్మ చూడగానే భూషణరావు కాళ్ళు వణికాయి. గుండె లయ తప్పింది. మూర్ఛ వచ్చినంత పనయింది. భూషణరావు ముఖంలో మారుతున్న రంగులు, ముచ్చెమటలు సుకుమార్ గమనించకపోలేదు.

భూషణరావు తడబడుతూ చెప్పాడు "అబ్బే ఇతడు మా అబ్బాయి కాదు. భరత్‌కుమార్ ఎంత మాత్రం కాదు."

భూషణరావు ఇంకక్కడ ఒక్క క్షణం కూడా వుండలేక పోయాడు. పోలీసాఫీసర్లతో అన్నాడు "ఆవిడని ఇక్కడికి పిలవక్కర్లేదు. నేను చెవుతు న్నాగా, అతను మా అబ్బాయి కాదని."

వెంటనే ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్పందించాడు. "క్షమించాలి సార్, మీరు సారుతో మాట్లాడు తుండగా మేడమ్ గార్ని కూడా ఇక్కడికి పిలిపించి ఐడెంటిఫికేషన్‌కే కదా అని వారికి ముందే శవాన్ని చూపించేసాం. పచ్చబొట్టు చూసి ఆమె కూడా మీరన్నట్లే, 'అతను మా అబ్బాయి కాద'న్నారు, శవాన్ని మీకు చూపించవలసిన అవసరం ఎంత మాత్రం లేదన్నారు."

కారులో వెయిట్ చేస్తున్న రత్నమ్మ భర్త కళ్ళలోకి చూసి తల దించుకుంది. ఆమె కళ్ళు అప్ప టికే ఎండిపోయాయి. పళ్ళ బిగువున దుఃఖాన్ని ఆపుకుంది.

* * *

ఆ రాత్రి–

ఆడిటోరియం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఫణిభూషణరావుకి నగర పెద్దలు పోటీపడి దండలు గుప్పించారు. ఫణిభూషణరావు ఆ దండల్ని పోగుచేసుకుని తీసికెళ్ళి కారు కేశాడు.

బంగ్లాకి చేరగానే హోం మంత్రి తన కారుకి వున్న పూల దండని తీసుకున్నాడు.

ఆ కారు రంగు తెలుపు–ఫణిభూషణరావు టోపీ తెలుపు, దుస్తులు తెలుపు–ఆయన చేతి లోని పూలదండ తెలుపు!

ఇంట్లోకి వెళ్ళాడు ఫణిభూషణరావు. ఎదు రుగా గోడకి కొడుకు ఫోటో!

ఆ ఫోటోకి తెల్లపూల దండ వేశాడు.

"వాడికి వేయవలసింది ఆ దండ కాదండీ..." అంటూ వచ్చి ఆ తెల్లపూల దండని తీసేసి ఎర్ర గులాబీల దండ వేసింది రత్నమ్మ!

విజ్ఞప్తి: కథకోసం కొన్ని చారిత్రక సంఘటనల్ని వాడుకున్నాను. అంతకుమించి ఆ వివరాలకు పోలేదు. గమనించమనవి – రచయిత


బహుమతులు అందజేస్తున్నవారు

